ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 25 అక్టోబరు 2025

వినియోగదారుల రక్షణకు
సమష్టి కృషి అవసరం
● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ 6లో

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకం
● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి 6లో

సర్వీసు ఉపాధ్యాయులకు టెట్



● నోటిఫికేషన్ జారీ చేసిన విద్యాశాఖ ● డిసెంబరు 10 నుంచి పరీక్షలు

● సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ఉపాధ్యాయుల డిమాండ్

నరసన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నిర్వహణకు విద్యాశాఖ శుక్రవారం షెడ్యూల్ జారీ చేసింది. నవంబరు 23 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. డిసెంబరు 10 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) నిర్వహించనుంది. 2011 నుంచి టెట్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కచ్చితంగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీం కోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ టెట్ నిర్వహణకు షెడ్యూల్ జారీ చేసింది. అయితే ఆర్‌టీఈ 2009 చట్టం.. 2010 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, 2010 ఏడాది ముందు నియామకపు ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయలకు ఈ చట్టం వర్తింపజేయడం సబబు కాదని ఉపాధ్యాయవర్గాలు గగ్గోలు చెందుతున్నాయి.

● మార్గదర్శకాలు ఇలా..

టెట్ నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అధికారులు మార్గదర్శకాలు జారీచేశారు. టెట్ రాసేందుకు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు 2011కు ముందు ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారికి ఓసీలైతే 45శాతం, ఎస్సీఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 40శాతం మార్కులు ఉండాలి. బీఈడీ, డీఈడీలో అయితే టెట్ రాసేందుకు ఎటువంటి అర్హత మార్కులు లేవని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. ఫీజు చెల్లింపు, దరఖాస్తుకు నవంబరు 23 వరకు అవకాశం ఇచ్చారు. జిల్లాలో వివిధ మేనేజ్‌మెంట్ పాఠశాలలో 14,300 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో సుమారు 9,800 మంది ఉపాధ్యాయులు 2011 ముందే నియమాకమయ్యారు. ప్రభుత్వ మార్గదర్శికాలు అనుగుణంగా వీరంతా టెట్ రాయాల్సి ఉంది.

● 150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉండే ఈ పరీక్షలో అర్హత పొందాలంటే ఓసీ కేటగిరీ వారు 90మార్కులు (60శాతం) బీసీలు 75మార్కులు(50శాతం) ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులు (మిగతా 6వ పేజీలో..)



గృహ నిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పేదల సొంతిల్లు కల నెరవేరుస్తాం

● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గూడులేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి. అర్హులను గుర్తించి త్వరలో నూతన నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకునేలా చూడాల'ని అధికారులకు ఆదేశించారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మిస్తామని ఆర్భాటపు ప్రచారం చేసి చివరకు లబ్ధిదారులను (మిగతా 6వ పేజీలో..)



వంశధార రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న సీఈ స్వర్ణకుమార్

జూన్ నాటికి 'వంశధార' పనులు పూర్తి
● ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు కేవీఎల్ స్వర్ణకుమార్ 6లో



సింగుపురంలో అసంపూర్తిగా నిలిచిన నర్సింగ్ కళాశాల భవనం

నర్సింగ్ కళాశాలకు మోక్షమేదీ?

● పదేళ్లుగా అసంపూర్తిగా నిర్మాణ పనులు

● టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన

● పట్టించుకోని గత ప్రభుత్వం

● అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా భవనం



కిటికీలకు తాళ్లు, ముళ్లకంచెతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. నర్సింగ్ కళాశాలకు మోక్షం కలగడం లేదు. పదేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రానికి సమీపాన సింగుపురంలో రూ.12.5 కోట్ల వ్యయంతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2015 ఆగస్టు 17న అప్పటి వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొన్నాళ్లపాటు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. కానీ 2019లో ప్రభుత్వం మారడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ కళాశాల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. టీడీపీ హయాంలో పురోగతిలో ఉన్న ఏ ఒక్క ప్రభుత్వ భవనాన్నీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈక్రమంలో నర్సింగ్ కళాశాల భవనాన్ని కనీసం ఒక్కసారి కూడా వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో భవనం అసంపూర్తిగానే ఉండి.. అసాంఘిక (మిగతా 6వ పేజీలో..)

ప్రీ రిపబ్లిక్ శిబిరానికి బీఆర్‌ఏయూ విద్యార్థులు

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని పటాన్ పట్టణంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 9 వరకు జరగనున్న ప్రీ రిపబ్లిక్ డే ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. మహేంద్ర డిగ్రీ కళాశాల (పాతపట్నం) బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం.మౌనిక, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎంఎల్‌ఐసీ రెండో సంవత్సరం విద్యార్థి కె.లోకేష్, ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల (కాశీబుగ్గ) బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి పి.చంద్రశేఖరరావు ఎంపికైనట్టు వర్సిటీ అధికారులు ప్రకటించారు. శుక్రవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ఆ విద్యార్థులను అభినందిస్తూ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలన్నారు. అలాగే వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తదితరులు వారిని అభినందించారు.



వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనితో ప్రీ రిపబ్లిక్ క్యాంప్‌నకు ఎంపికైన విద్యార్థులు

సర్వే నిర్వహిస్తే ప్రతిఘటన తప్పదు
● థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ యోగి 8లో

చెడు వ్యసనాలకు బానిసై..
దొంగగా మారి
● పంచలోహ విగ్రహాల చోరీ కేసులో యువకుడి అరెస్టు 8లో



ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అధ్యక్షా.. అనాలని ఉందా?
● విద్యార్థులకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం
● మాక్ అసెంబ్లీకి సన్నాహాలు
● పాఠశాలల్లో ప్రారంభమైన పోటీలు
● త్వరలో శాసనసభలో నిర్వహణ
6లో

రేషన్ అక్రమాలకు చెక్!

● బియ్యం నిర్ధారణకు రసాయన కిట్లు

● సివిల్ సప్లయిస్ డీటీలకు పంపిణీ

● ఎరుపు రంగులోకి మారితే అక్రమమే

● వెంటనే కేసు నమోదుకు చర్యలు





పౌరసరఫరాల శాఖ డీటీలకు అందించిన రసాయన కిట్లు

ఇచ్ఛాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో అక్రమ రవాణాకు చెక్‌పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అధికారుల తనిఖీల్లో పట్టుబడిన బియ్యం ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించినవా? కావా? అన్నది క్షణాల్లో తేలిపోనుంది. ఈ మేరకు ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ అధికారులకు రసాయనాలతో కూడిన కిట్లు అందజేయనుంది. ఇకపై బియ్యం ఎక్కడ దొరికితే అక్కడే పరీక్ష చేసి.. అక్రమమని తేలితే అధికారులు కేసులు నమోదు చేయనున్నారు. జిల్లాలో 1603 రేషన్‌డిపోలు ఉన్నాయి. 6,60,739 రేషన్‌కార్డులు, 24లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. రేషన్ పంపిణీలో భాగంగా డీలర్లు ప్రతినెలా 8,935 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందిస్తున్నారు. పోషక విలువలు ఉన్న ఈ బియ్యాన్ని అవగాహన లేక ఎక్కువమంది వినియోగించడం లేదు. 60శాతం మంది విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కార్డుదారుల నుంచి కిలోబియ్యం రూ.18 వరకూ దళారులు కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లతో ఒప్పందం చేసుకొని వారికి విక్రయిస్తున్నారు. మిల్లర్లు రీపాలిష్ చేసి వేర్వేరు బ్రాండ్లకు చెందిన బ్యాగుల్లో బియ్యాన్ని నింపి అధిక ధరకు అమ్ముకుంటున్నారు. విజయనగరం, విశాఖ, ఒడిశా ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని గత ఏడాది కాలంలో అక్రమంగా తరలించే 55 టన్నుల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నా.. బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదు. ఈ నేపథ్యంలో ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం భావించి.. బియ్యం నిర్ధారణకు రసాయణ కిట్లు అందజేయనుంది. జిల్లాలో 15మంది సివిల్ సప్లయ్ డీటీలు, యూడీఆర్‌ఐలకు 4, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి రెండు రసాయన కిట్లు అందిస్తారు. మరో కిట్‌ను జిల్లాకేంద్రంలో అందుబాటులో ఉంచుతారు. ఆయా కిట్లలో ఉన్న రెండు రకాల రసాయనాలను వినియోగించి బియ్యాన్ని పరీక్షిస్తారు. అవి ఎరుపు రంగులో మారితే రేషన్ బియ్యంగా నిర్ధారిస్తారు. ఆరు నెలల ముందు పంపిణీ చేసినవైనా (మిగతా 6వ పేజీలో..)

ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయ్

● తాళభద్రలో ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు

● భూసేకరణకు సిద్ధమైన రెవెన్యూ అధికారులు

● పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక

పలాస, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేలా తాళభద్ర వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి 1.08 ఎకరాల భూమి అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు భూసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. మొత్తం 53 మంది రైతులకు చెందిన 1.08 ఎకరాల భూమిని గుర్తించి ప్రభుత్వానికి పరిహారం కోసం నివేదించారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్‌తోపాటు తాళభద్ర రైల్వే బ్రిడ్జి కూడా ఏడాదిలో పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు తాళభద్ర, కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలే ప్రధాన ఆటంకంగా మారాయి. రెండు బ్రిడ్జిలు నిర్మాణం జరిగితే పలాస-వజ్రపుకొత్తూరు మండలాలకు ఇబ్బందులు లేని మార్గం ఏర్పడుతుంది. శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లే వాహనాలకు అడ్డంకులు తొలుగుతాయి. ప్రతిరోజు రైల్వే లెవిల్‌క్రాస్ రోడ్డుమీదుగా వేలాది వాహనాలు వెళ్తుంటాయి. గ్రేడ్-1 రైల్వేస్టేషన్‌గా గుర్తింపు ఉన్న పలాస మీదుగా వందల సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగిస్తుండడంతో ప్రతి పది నిమిషాలకు రైల్వేగేటు వేస్తుంటారు. దీంతో గంటల కొద్దీ ట్రాఫిక్ ఇబ్బందులను ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్నారు. దీనిపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మాణం ఆగిపోయిన కాశీబుగ్గ ఫ్లైఓవర్ (మిగతా 6వ పేజీలో..)



తాళభద్ర ఎల్‌సీ గేటు (ఫ్లైఓవర్ నిర్మించనున్న ప్రాంతం ఇదే)

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఆలస్యం



గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే బ్రిడ్జిల నిర్మాణం జరగలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గౌతు శిరీష కేంద్ర, రాష్ట్ర మంత్రులతో నేరుగా మాట్లాడి రూ.100 కోట్లకు పైగా నిధులు విడుదల చేయించారు. ప్రస్తుతం కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. తాళభద్ర బ్రిడ్జి కూడా తొందరలోనే పూర్తవుతుంది. పలాస నియోజకవర్గప్రజల చిరకాలవాంఛ ఈ రెండు బ్రిడ్జిలు కూటమి హయాంలోనే జరగడం అదృష్టంగా భావిస్తున్నాం.

- టంకాల రవిశంకర్‌గుప్తా, టీడీపీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు

ప్రజల ఇబ్బందులు తొలగుతాయి



రెండు ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు లేని రహదారి ఏర్పడుతుంది. రైల్వేగేట్లు వేయడం వల్ల కనీసం 40 నిమిషాలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కోవలసి వస్తుంది. ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు ప్రజలు రుణపడి ఉంటారు.

- ఎ.రామకృష్ణ, 4వ వార్డు ఇన్‌చార్జి, అంబుసోలి

- విద్యార్థులకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం
- మాక్ అసెంబ్లీకి సన్నాహాలు
- పాఠశాలల్లో ప్రారంభమైన పోటీలు
- త్వరలో ఏపీ శాసనసభలో నిర్వహణ



అధ్యక్షా.. అనాలని ఉందా?



విద్యార్థులూ.. శాసనసభ ఎలా ఉంటుందో చూడాలని ఉందా? మీకూ మాట్లాడే అవకాశం వస్తే బాగుండునని అనిపిస్తోందా? మీ అభిప్రాయాలు చెప్పాలని ఉందా? అయితే మీలాంటి వారి కోసమే విద్యాశాఖ మాక్ అసెంబ్లీని నిర్వహిస్తోంది. తద్వారా అసెంబ్లీలో అడుగు పెట్టే అవకాశం కల్పిస్తోంది. దీని కోసం ఇప్పటికే పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో మీరు ప్రతిభ చూపిస్తే.. ఆ అవకాశం దక్కించుకోవచ్చు.

కోటబొమ్మాళి/నరసన్నపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):

పాఠశాల విద్యార్థులకు అసెంబ్లీలో అడుగు పెట్టే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించనుంది. అసెంబ్లీలో ప్రవేశించి ఎమ్మెల్యేలా మాట్లాడి తమలోని నాయకత్వ లక్షణాలు నిరూపించుకోవచ్చు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యాశాఖ ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు కలిగిన ఎందరో రాజకీయ నాయకులుగా ఎదిగి ఉన్నత పదవులు నిర్వహించారు. అలాంటి స్ఫూర్తిని విద్యార్థుల్లో రగిలించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసింది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో అమరావతిలో అసెంబ్లీలో మాక్ అసెంబ్లీ నిర్వహణకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా విద్యార్థుల ఎంపికకు ఆదేశాలు జారీ చేసింది.

ఎంపిక ఇలా..

ప్రస్తుతం 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. వీరిలో ఆరుగురు చొప్పున మండల స్థాయికి ఎంపిక చేస్తున్నారు. మండల స్థాయి నుంచి ఆరుగురి వంతున ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే నియోజకవర్గ స్థాయికి పోటీలకు... అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి అసెంబ్లీ పోటీలకు ఎంపిక చేస్తారు. నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే మాదిరిగా ఎంపిక చేసి అమరావతిలోని అసెంబ్లీలోనే మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు. అక్కడ సీఎం, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలుగా విద్యార్థులు వ్యవహరించనున్నారు.

జిల్లా నుంచి 8మందికి అవకాశం..

శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరి వంతున ఎనిమిది మంది మాక్ అసెంబ్లీలో పాల్గొననున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 450, యూపీ స్కూల్స్ 198 ఉన్నాయి. వీటిలో సుమారు సుమారు 65వేల మంది 8,9,10 తరగతులు చదువుతున్నారు.

పోటీల నిర్వహణకు చర్యలు..

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపిక కోసం పోటీలు నిర్వహించనున్నాం. ఈనెల 21 నుంచి 30 వరకు పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరి చొప్పున ఎంపిక చేసి అమరావతికి పంపిస్తాం.

-రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి



బూరవెల్లి గ్రామం

బూరవెల్లిలో 27న నాగులచవితి

- షష్టి రోజున నిర్వహించడం ఆనవాయితీ

గార, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే నాగుల చవితి పండగను బూరవెల్లి గ్రామస్థులు మాత్రం చవితి రోజున కాకుండా కార్తీక శుద్ధ షష్టి (ఈ నెల 27) రోజున నిర్వహిస్తారు. వంశధార నది ఒడ్డున ఉన్న ఈ గ్రామంలో సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. చారిత్రక ప్రాధా న్యం ఉన్న ఈ గ్రామంలో నాగులచవితితో పాటు మరికొన్ని పండుగలను కూడా గ్రామ స్థులు ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీ గా వస్తోంది. పూర్వకాలం నుంచి ఈ గ్రామంలో కార్తీక శుద్ధ షష్టి రోజున నాగులచ వితి నిర్వహిస్తున్నారు. అదే విధంగా భోగి రోజున భోగి మంట కూడా వేయరు. రైతులు పొలంలో ఏరువాకనూ నిర్వహించరు. ఈ గ్రామంలో 400 ఏళ్ల నాటి ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు మరికొన్ని ఆలయాలు ఉన్నాయి.

సంప్రదాయంగా వస్తోంది..



మా గ్రామంలో నాగులచవితి పండగను కార్తీక శుద్ధ షష్టి రోజున నిర్వహించడం సంప్రదాయం. ఆ రోజున నాగదేవతకు ప్రతీకగా పుట్టలో పాలుపోసి.. నైవేద్యం పెట్టడం ఆనవాయితీగా వస్తోంది.

-ఆరవెల్లి సీతారామస్వామి, బూరవెల్లి

మార్కెట్లకు చవితి కళ

- కొనుగోలుదారులతో రద్దీ



రద్దీగా ఉన్న కాశీబుగ్గ బజారు

కాశీబుగ్గ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్లకు నాగుల చవితి కళ వచ్చింది. వివిధ ప్రాంతాల్లో శుక్రవారం పూజా సామగ్రి కొనుగోలుదారులతో సందడి నెలకొంది. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల మార్కెట్లు కిటకిటలాడుతూ కనిపించాయి. శనివారం నాగులచవితి కావడంతో శుక్రవారం ఉదయానికే కాశీబుగ్గ బస్టాండ్ ప్రాంగణం, కూరగాయల సంత కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. కొబ్బరికాయలు, అరటి పండ్లు, అరటి ఆకులు, గుమ్మడి కాయలతో పాటు పూజకు అవసరమైన అన్ని సరుకులను రైతులతో పాటు వ్యాపారులు విక్రయించారు. దీంతో ఉదయం 7 గంటలకే ఎన్నడూ లేనంత రద్దీగా మార్కెట్లు మారాయి. మరోవైపు ధరలు కూడా పెరిగాయి. కొబ్బరికాయ రూ.50 వరకూ పలికింది. డజను అరటి పండ్లు రూ.50 పైమాటే. అయినా సరే పండుగ కావడంతో కొనుగోలు చేయాల్సిన అనివార్య పరిస్థితి ప్రజలది. దీంతో వ్యాపారులు చెప్పినంత ధరలకు పూజా సామగ్రి తీసుకోవలసి వచ్చింది.



రాగోలు-తొగరాం బీటీ రహదారిలోని గోతులు

ఇదేం రోడ్డు బాబోయ్!

- భారీ గోతులతో దర్శనమిస్తున్న వైనం
- దారి పొడవునా బురద

ఆమదాలవలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూసి... వరి పంటతో కళకళలాడాల్సిన పొలం ఇలా ఉందేంటి అనుకుంటున్నారా? కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుస్తుంది అది పొలం కాదని. అవును అది పొలం కాదు. మండలంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన రాగోలు-తొగరాం బీటీ రహదారి. ఇది పూర్తిగా అధ్వాన్న స్థితికి చేరుకొని పంట పొలాన్ని తలపిస్తోంది. ఈ రహదారిలో వాహనదారులు తీవ్ర భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూసి జంక్షన్ నుంచి కొత్తవలస మీదుగా ఆమదాలవలస చేరుకొనే ఎంతో మంది ప్రయాణికులకు ఈ బీటీ రహదారి ఉపయోగకరంగా ఉండేది. ఒకప్పుడు ఇరుకుగా ఉన్న ఈ రహదారిని తరువాతి కాలంలో రెండులైన్లుగా విస్తరించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషించాఆరు. నాగావళి నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న బీటీ రహదారిలో ప్రయాణం సాగించే వ్యక్తులకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. అదే నాగావళి నదీ తీరంలో ఇసుక తవ్వకాలు ప్రారంభించడం... భారీ వాహనాల రాకపోకలతో ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా మారింది. తొగరాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, వ్యవసాయ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బురద రహదారిలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురద కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. ఇక్కడ నూతనంగా రహదారిని నిర్మించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

జూన్ నాటికి 'వంశధార' పనులు పూర్తి

- ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల సీఈ స్వర్ణకుమార్

హిరమండలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ నాటికి వంశధార ఫేజ్-2లో స్టేజ్-2 పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ కేవీఎల్ స్వర్ణకుమార్ చెప్పారు. శుక్రవారం హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌కు అనుసంధానంగా జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించారు. పనుల తీరుపై వంశధార అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. దీనికి సంబంధించి సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 19 టీఎంసీల సామర్థ్యంతో చేపడుతున్న హిరమండలం రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఒడిశా అడ్డంకుల వల్ల నేరడి బ్యారేజి పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ వాటాకు వచ్చే 19టీఎంసీల నీటిని వాడుకునేందుకు రూ.176 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని సీఈ వివరించారు. ఇది పూర్తయితే 10 నుంచి 12 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేసుకోవచ్చన్నారు.

ప్రాధాన్య ప్రాజెక్టులు ఇవే..

ఉత్తరాంధ్రలో 9 ప్రాజెక్టులను ప్రాధాన్యంగా ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. అందులో శ్రీకాకుళంలో వంశధార ఫేజ్2, లిఫ్ట్ ఇరిగేషన్, నాగావళి-వంశధార నదుల అనుసంధానం, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఉన్నాయని చెప్పారు. నాగావళి-వంశధార నదులకు సంబంధించి హైలెవల్ కెనాల్ పనులు 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు. హిరమండలం రిజర్వాయర్, 87, 88 ప్యాకేజీ పనులకు సుమారు రూ.200 కోట్లు అవసరం ఉందన్నారు. దీనికి నిధుల సమస్య లేదని తెలిపారు. గొట్టా బ్యారేజీ దిగువన ఏప్రాన్ పనులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని చీఫ్ ఇంజనీర్ కేవీఎల్ స్వర్ణకుమార్ చెప్పారు. ఆయనతో పాటు వంశధార ఎస్ఈ జి.రామచంద్రరావు, కట్టడాల విభాగం ఈఈ బి.రవీంద్ర, డీఈ మురళీమోహన్, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకమని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి అన్నారు. కోర్టు కానిస్టేబుళ్లతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా కోర్టు కానిస్టేబుళ్ల విధులు, ముఖ్యమైన కేసుల్లో అభియోగ పత్రాల దాఖలు, సీసీ నెంబర్లు, సమన్లు, వారెంట్ల అమలు, న్యాయస్థానాల్లో హాజరుపై ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కానిస్టేబుళ్లకు సమయ పాలన, నిబద్ధత అవసరం అని చెప్పారు. ప్రతి కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు, సమయానికి కోర్టులకు చేరేలా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమైన కేసుల్లో అభియోగ పత్రాలు సమయానికి దాఖలు చేయడం అత్యంత ముఖ్యమని చెప్పారు. సీసీ నెంబర్ల ప్రగతిపైన కూడా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు సమన్లు, బెయిల్‌బుల్ వారెంట్ల అమలు విషయంలో ఆలస్యం లేకుండా, కోర్టు ఆదేశాల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమన్లు, నాన్‌బెయిలబుల్ వారెంట్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలన్నారు. వాటి అమలుపై నివేదికలు సమర్పించాలని ఎస్పీ ఆదేశించారు. డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, సీఎంఎస్ ఎస్ఐ భాస్కరరావు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సర్వీసు ఉపాధ్యాయులకు టెట్

(ఐదో పేజీ తరువాయి)

60 మార్కులు (40 శాతం) సాధించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇంత తక్కువ సమయంలో నోటిఫికేషన్ జారీ చేయడంపై కొందరు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు పాఠాలు బోధించి.. టెట్‌కు ఎలా సిద్ధమయ్యేదని తలలు పట్టుకుంటున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని కోరుతున్నారు.

నిర్ణయం సరికాదు..

సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అనే విషయాన్ని యూటీఎఫ్ నాయకులు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఉద్యోగంలో రావడానికి అవసరమైన విద్యార్హతలు కలిగి, పోటీపరీక్షల్లో విజయం సాధించి నియామకం పొందారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ,కేరళ ప్రభుత్వాలు ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేశాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. 'సీనియర్ ఉపాధ్యాయులకు మళ్లీ పరీక్షల పేరుతో మానసిక ఆందోళనకు గురిచేయడం తగదు. సమయాన్ని వృథా చేయడం.. బోధనా సమయాన్ని తగ్గించడం తప్ప మరే ప్రయోజనం ఉండద'ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి పేర్కొన్నారు.

నర్సింగ్ కళాశాలకు మోక్షమేదీ?

(ఐదో పేజీ తరువాయి)

కార్యకలాపాలకు నెలవుగా మారింది. మందుబాబులు.. చుట్టుపక్కల వారు దర్జాగా ఆ భవనాన్ని వినియోగించుకుంటున్నారు. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి.. వర్షపునీరు నిలిచిపోతుంది.

- **పాడవుతున్న భవనం..**

నర్సింగ్ కళాశాల నిర్వహణకు.. పరిపాలనకు గాను భవనం నిర్మాణం సమగ్రంగా చేయాల్సి ఉంది. ఇదంతా భవన నిర్మాణ ప్లాన్‌లో ఉంది. ప్రస్తుతం భవనం నిర్మాణం పూర్తయింది. కిటికీలకు తలుపులు అమర్చలేదు. దీంతో రాత్రివేళ.. కొందరు ఆ భవనంలోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. స్థానికులు కొందరు ఆయా కిటికీలకు ఇటీవల తాళ్లు కట్టి.. ముళ్లకంచెలు వేసి.. తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఇదిలా ఉండగా.. పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో కొన్ని పనులు మధ్యలో వదిలేశారు. నర్సింగ్ కళాశాలకు సంబంధించి మరో భవనం నిర్మాణం కోసం పిల్లర్లు వేసి అంతటితోనే నిలిపివేశారు. ఈ భవనం.. జాతీయ రహదారికి అనుకుని పక్కనే ఉంది. నేటికి పదేళ్లు పూర్తయినా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారిస్తే నర్సింగ్ కళాశాల వినియోగంలోకి వచ్చే అవకాశముంది. లేదంటే కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనం.. ప్రారంభానికి ముందే శిథిలమయ్యే పరిస్థితి ఏర్పడనుంది.

- **ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించా..**

శ్రీకాకుళం నియోజకవర్గంలో నర్సింగ్ కళాశాల అసంపూర్తిగా ఉండిపోయింది. దీనికి నిధులు అవసరమని రెండుసార్లు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లాను. నిధులు మంజూరుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నా. అతి త్వరలో నర్సింగ్ కళాశాల పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

పేదల సొంతిల్లు కల నెరవేరుస్తాం

(ఐదో పేజీ తరువాయి)

నిండా ముంచేసిందని ఆరోపించారు. ప్రణాళిక లేకుండా గృహనిర్మాణ పథకం అమలులో విఫలమైందన్నారు. ఫలితంగా లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

- తొలుత కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇళ్లు మంజూరు చేయాలని చాలామంది వినతులు అందజేశారు. ఈ మేరకు నవంబరు 15వ తేదీలోగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పత్రాలు గృహనిర్మాణ కార్యాలయంలో అందజేయాలని మంత్రి అచ్చెన్న తెలిపారు. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారు వచ్చే నెల లోగా ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని యూనిట్ మార్చ్‌కు సంబంధించిన గోడపత్రికను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ ప్రాజెక్టు అధికారి రమాకాంత్, ఎన్వైకే అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

పనుల కోసం రైల్వేశాఖ నుంచి రూ.48 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే తాళభద్ర బ్రిడ్జికి కూడా నిధులు కేటాయించారు. ఈ క్రమంలో తాళభద్ర బ్రిడ్జికి సంబంధించి బుధవారం నిర్వాసితుల జాబితా, భూములు సిద్ధం చేశారు. మొత్తం భూ సేకరణతోపాటు రైతులను కూడా గుర్తించారు. వారికి నిబంధనల ప్రకారం పరిహారం ఇచ్చి నిర్మాణ బాధ్యతలను రైల్వేశాఖకు అప్పగించనున్నారు. త్వరలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉంది. ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదల చేసిన ఆరు నెలల్లో సంబంధిత పనులు ప్రారంభం కానున్నాయి.

వినియోగదారుల రక్షణకు సమష్టి కృషి అవసరం

- ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారుల హక్కులు, రక్షణ కోసం కౌన్సిల్ పరిధిలో ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ కింద ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు? లీగల్ మెట్రాలజీ విభాగం పనితీరు ఎలా ఉందో అధికారులను ఆరా తీశారు. ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తూనికలు, కొలతల విషయంలో జరుగుతున్న మోసాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలి సమావేశంలో వినియోగదారుల రక్షణకు సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో స్టాంప్ చేయని తూకాలు, రాళ్లతో తూకం వేయడం వంటి వాటిపై లీగల్ మెట్రాలజీ అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఆహార ధాన్యాలు, పప్పులు, పండ్లలో కల్తీని నిరోధించడం, చట్టాలను కఠినంగా అమలు చేయడంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ ప్రదర్శన, వినియోగదారుల ఫిర్యాదుల రిజిస్టర్ లభ్యత, ఉచిత తాగునీటి సౌకర్యంపై సమీక్షించారు.

అధిక చార్జీలపై దృష్టి..

ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక చార్జీలు వసూలు చేయడాన్ని అరికట్టడం, గడువు ముగిసిన మందులు, నకిలీ మందుల అమ్మకాన్ని నిరోధించడంపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టిసారించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. నకిలీ, ధ్రువీకరించని విత్తనాల అమ్మకం, విత్తనాలు, ఎరువులకు అధిక ధరలు వసూలు చేయడాన్ని అరికట్టాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాకు చెక్!

(ఐదో పేజీ తరువాయి)

రీపాలిష్ చేసినా ఇట్టే గుర్తిస్తాయి ఈ రసాయనాలు. రేషన్ బియ్యం అక్రమ రవాణా నిర్ధారణ అయితే.. వెంటనే అధికారులు కేసులు నమోదుకు చర్యలు చేపట్టనున్నారు.

కిట్లు అందించాం..

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రించేలా దృష్టి పెట్టాం. తనిఖీల సమయంలోనే బియ్యం అక్రమమని నిర్ధారించేందుకు రసాయన కిట్లు వచ్చాయి. పౌరసరఫరాలశాఖ తహసీల్దార్లతో పాటు ఆర్ఐలకు అందించాం. వారు తనిఖీలు చేపట్టి బియ్యం పరీక్షలు చేసి నిర్ధారిస్తారు.

-సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

పోలీసుల డైరీలో 'మోస్ట్ వాంటెడ్' నేరగాడు



దున్న కృష్ణ

శ్రీకాకుళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఆరు భాషల్లో మాట్లాడుతూ ఇళ్లకు కన్నం వేస్తూ పోలీసుల డైరీలో 'మోస్ట్ వాంటెడ్'గా స్థానం పొందాడు. వివరాలిలా ఉన్నాయి.. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మెళియా పుట్టి మండలం చాపర రెల్లి వీధికి చెందిన దున్న కృష్ణ(50) ఇళ్లకు కన్నం వేయడంలో ఆరితేరాడు. జిల్లాలో పలుచోట్ల ఇతనిపై కేసులు నమోదయ్యాయి. ఇక్కడి నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్రం నీసల్ మసీద్ పక్కన టూన్య వీధిలో మకాం మార్చాడు. అక్కడి నుంచి వస్తూ.. వెళ్తూ.. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఆ అనుభవంతో తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, ఒడియా, తమిళ భాషలను నేర్చుకుని ప్రజలను ఏమార్చి చోరీలకు పాల్పడేవాడు. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఇతనిపై శ్రీకాకుళం టూటౌన్, రూరల్ స్టేషన్‌లో కేసులు పెండింగ్ ఉన్నాయి. కృష్ణ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియ జేయాలని.. నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం తెలిసినవారు పోలీస్ కంట్రోల్ రూం 63099 90933 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు ప్రకటించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి: శంకర్



దూడల ప్రదర్శనలో విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం తూలుగు సచివాలయం వద్ద పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య గర్భకోశ వ్యాధి నిర్ధారణ శిబిరం, మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాడి రైతులకు రాయితీలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేలు జాతి పాడి ఆవు లను పెంచడం ద్వారా అధిక పాల ఉత్పత్తి చెంది రైతులు ఆర్థికంగా నిలదొక్కు కునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం దూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్, డీడీ గణపతిరావు, ఏడీ డాక్టర్ బాలకృష్ణ, సర్పంచ్ కొయ్యాన నాగభూషణరావు, మాజీ సర్పంచ్ జగదీష్, తూలుగు పీఏసీ ఎస్ ఛైర్‌పర్సన్ కొయ్యాన శేఖర్, పశువైద్యాధికారి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

అరసవల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యువత పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా చేసుకో వాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పుస్తక విక్రయాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రవిబాబు, ఇన్‌చార్జి నజీర్‌ఖాన్, ఏఐవై ఎఫ్ అధ్యక్షుడు కొన్న శ్రీనివాస్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పనుల నిమిత్తం ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోంపేట, బెంకిలి, జింకిభద్ర గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మహిళల్లో సాంకేతిక చైతన్యం పెరగాలి

కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం రూపొందించిన సాంకేతికతపై మహిళల్లో చైతన్యం పెరగాలని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాద రావు అన్నారు. నగరంలోని రైతుబజార్ సమీపంలోని పట్టణ మహిళా సమాఖ్య వనరుల కేంద్రంలో 'మనమిత్ర' వాట్సాప్ సేవలపై మెప్మా సిబ్బంది, ఆర్పీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జి.కిశోర్‌బాబు, బి.రామారావు, వై.శారదావాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కాళ్ల'

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరా బాద్‌లో శుక్రవారం జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జయదేవ్‌ను సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

సేంద్రియ వ్యవసాయం అలవరచుకోవాలి

సోంపేట/కవిటి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని అలవరచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ వెంకటరావు కోరారు. శుక్రవారం సోంపేట మండలం లక్కవరం, కవిటి మండలం జగతిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, నానో యూరియాను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు ఉదయ్, మధు కుమార్, ఏవోలు బి.నరసింహమూర్తి, పి.శ్రీదేవి, వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి



కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు పేరు తీసుకురావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన పోలీస్ నియామకాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హోంగార్డులుగా విధులు నిర్వహిస్తూ కృషి, పట్టుదలతో కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబు ళ్లుగా ఎంపికైన ఎస్.నరేష్, ఎర్రన్న, డి.హటకేశం, జె.వెంకట రమణ, జి.చిన్నారావు, సీహెచ్ సంజీవరావు, వై.తిరుపతిరావులకు శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో సీహెచ్ గోపీనాథ్, హోంగార్డు ఆర్ఎస్ఐ ఆర్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రం వద్ద శుక్రవారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వి.తిరుమలరావు రాజ్యాంగ నిర్మాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంఈవో కె.అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణ యాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకూడదని, ప్రభుత్వమే నడపాలన్నారు. పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమం' విజయవంతం చేయండి

రణస్థలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28న నిర్వహించనున్న ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం పార్టీ క్యాంపు కార్యాలయంలో వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

జి.సిగడాం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ అన్నారు. తాగునీటి బోరు పనులను శుక్రవారం ప్రారంభించారు. ముద్దాడ గౌరి, త్రినాథరావు, పంచాయతీ కార్యదర్శి సాహు పాల్గొన్నారు.

గోతులు పూడ్చరు.. అగచాట్లు తీరవు

● ఇదీ కొత్తూరు పోస్టాఫీసు ఎదురుగా రహదారి దుస్థితి



కొత్తూరు కళాశాల రహదారిలో ఏర్పడిన గొయ్యి

కొత్తూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్తూరు కళాశాల రహదారిలో పోస్టాఫీసు ఎదురుగా ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు.చీకటిపడిన తర్వాత ఈమార్గంలో వచ్చిపోయే వారంతా బోల్తాపడి గాయపడుతున్నారు. పెట్రోల్ బంకు నుంచి ఆంజనేయ ఆలయం వరకు కాలువ పనులుచేసి మిగిలిన పనులుచేయకపోవడంతోపాటు రహదారిపై గోతులు పూడ్చలేదు. ఇటీవల కేంద్రమంత్రి కింజరాపురామ్మోహన్‌నాయుడితోపాటు కలెక్టర్ వసప కేజీబీవీ పాఠశాల అదనపు గదులు పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన సమయంలో ఎమ్మెల్యే సమక్షంలో పరిసరాల్లో నివాసముంటున్న వారంతాఈ రహదారి దుస్థితిని వివరిం చారు. దీంతో నెలరోజుల్లో పనులు పూర్తిచేసి పక్కా రహదారి వేయిస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హామీఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

వైద్యుడు లేక.. సేవలందక

● ఫార్మాసిస్టు సెలవు పెడితే మూతవేయాల్సిన వైనం

● ఇదీ బ్రాహ్మణతర్లాలో హోమియోపతి డిస్పెన్సరీ పరిస్థితి



బ్రాహ్మణతర్లాలోని హోమియో వైద్యశాల

పలాసరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణతర్లాలో హోమియోపతి డిస్పెన్సరీలో వైద్యుడులేకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలందడంలేదు. దీంతో ఫార్మాసిస్టుతోనే నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. బ్రాహ్మణతర్లాలో 1987లోఅద్దెభవనంలో హోమియోపతి డిస్పెన్సరీని ప్రారంభించారు.2003లో టీడీపీహయాంలో నూతన భవనంప్రారంభించి వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక హోమియోపతి వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతోఆదరణపెరిగింది. అయితే నాలుగు నెలల కిందట ఇక్కడ పనిచేసిన వైద్యుడు జగతికి బదిలీపై వెళ్లారు.ఆ స్థానంలో ఇప్పటివరకూ ఎవరినీ నియమించకపోవడంతో ఇక్కడ ఉన్న ఫార్మాసిస్టు సేవలందించాల్సివస్తోంది. రోగులకు పాత చీటిలపైన మందులను ఫార్మాసిస్టు ఇచ్చే అవకాశముండగా, కొత్తగా వచ్చేరోగులకు ఏవిధంగా సేవలందిస్తారన్న సందేహాలు నెలకొన్నాయి.ఇక్కడ ఫార్మాసిస్టు సెలవు పెడితే ఆసుపత్రిని మూసివేయాల్సిన దుస్థితి నెలకుంటోంది. కాగా బ్రాహ్మణతర్లాలో హోమియోపతి డిస్పెన్సరీలో వైద్యుడు లేకపోవడంపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఈ శాఖ రీజనల్ డిప్యూటీడైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

వాహనం ఢీకొనడంతో..

సోంపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాత జాతీయరహదారి శాసనం సమీపంలో శుక్రవారం జరిగినరోడ్డు ప్రమాదంలో గాంధిగాం కర్రల మిల్లులో రోజువారీ కూలిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. బారువ పోలీసుల కథనం మేరకు.. పాలవలసకు చెందిన తామాడ యాదవరావు (45) మహేంద్రతనయనది సమీపంలో బహిర్భూమికి వెళ్లి జాతీయ రహదారికి ఎక్కేక్రమంలో హరిపురం నుంచి వస్తున్న ఓ వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ యాదవరావు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బారువసీహెచ్‌సీకి తరలించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ..

జలుమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వేస్టేషన్ పరిధిలో తిలారు రైల్వేగేటుకు ఉర్లాం స్టేషన్ మధ్యలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. శ్రీకాకుళం రైల్వేపోలీసు హెడ్ కానిస్టేబుల్ ఎస్.మధుసూదనరావు కథనం మేరకు..ఆమదాలవలస నుంచి పలాస వైపు వెళ్లే గుర్తు తెలియని రైలుఢీకొని ఒకరు మృతిచెందారు. ఆ వ్యక్తికి 40 నుంచి 45 సంవత్సరాలు మధ్య వయసు ఉంటుంది. నీలం రంగు హాఫ్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న హెచ్‌సీ సంఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా జరిపించారు.మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...

పలాసరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడఖండి జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది.ఎస్‌ఐ నర్సింహమూర్తి,స్థానికుల కథనంమేరకు.. రోడ్డుపై నడుచుకొని వెళ్తున్న మహిళను వాహనం ఢీకొంది. దీంతో ఆమె తుప్పల్లోకి పడిపోవడంతో ఆప్రాంతం చీకటిగా ఉండడంతో ప్రమాదాన్ని స్థానికులు తొలుత గుర్తించలేకపోయారు. ప్రమాదం జరిగిన గంట తరువాత స్థానికులు ఆమెను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళ కాదని పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకూ ఆమె ఆచూకీ తెలియలేదు.దీంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు కేసుగా నమోదుచేశారు. ఎవరూ ఇంతవరకూ మృతదేహం వద్దకు రాలేదు. వివరాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

చెడు వ్యసనాలకు బానిసై.. దొంగగా మారి

● నరసన్నపేటలో పంచలోహ విగ్రహాల చోరీ కేసులో యువకుడి అరెస్టు



స్వాధీనంచేసుకున్న పంచలోహ విగ్రహాలతో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు బానిసగా మారిన ఓ యువకుడు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. తాజాగా నరసన్నపేటలో పంచలోహ విగ్రహాలు చోరీకి పాల్పడడంతో పోలీసులు అరెస్టుచేశారు. శుక్రవారం నరసన్నపేటలో టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌తో కలిసి అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. ఏఎస్పీ కథనం మేరకు.. నరసన్నపేటలోని ఇందిరానగర్ కాలనీలోగల సిద్ధాశ్రమంలో ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఆశ్రమంలోని ఆంజనేయస్వామి, వినాయకుని, కుమారస్వామి, రెండు అయ్యప్పస్వామి విగ్రహాలు, శ్రీరామపట్టాభిషేకం పంచలోహ విగ్రహాలతోపాటు కంచుగంట, ఇత్తిడిపళ్లెం దొంగిలించి గొనెసంచిలో తీసుకువెళ్లారు. సిద్ధాశ్రమంలో చోరీ జరిగినట్లు సాయంత్రం ఏడు గంటలు సమయంలో గుర్తించి ఆశ్రమ కార్యదర్శి ముద్దాడ శ్రీనివాసరావు అదేరోజు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం తామరాపల్లి వద్ద ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీచేస్తుండగా గొనెసంచె భుజాన వేసుకొని జిల్లేడిమాకివలస జంక్షన్ నుంచి వస్తున్న ఒక వ్యక్తి పోలీసులను చూసి పరుగుతీశాడు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో ఆయన్ను పట్టుకున్నారు. గొనెసంచిలో సిద్ధాశ్రమంలో చోరీకు గురైన రూ.1.40 లక్షలు విలువచేసే పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకొని నరసన్నపేటలోని హడ్కోకాలనీకు చెందిన 24 సంవత్సరాల యువకుడు దుంపల సింహాచలాన్ని అరెస్టుచేశారు. గతంలో మారుతీనగర్‌లో ఓ బాలికను వేధించడంతో సింహాచలంపై పోక్సో కేసు నమోదయ్యింది. 2021 తన స్నేహితుడితో కలిసి జగన్నాథపురంలో ఒక చోరీ కేసులో బాలనేరస్థుడిగా జువైనల్ హోంకు తరలించారు. మోటార్ సైకిల్ చోరీ కేసులో కూడా అరెస్టు చేశారు. చిన్నతనం నుంచి చెడు వ్యసనాలకు బానిసై నేరస్థుడిగా మారాడు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

పాతపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలానికి చెందిన ఐదుగురు బెల్ట్‌షాపు నిర్వాహకులను తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట శుక్రవారం హాజరుపరచగా ఏడాదిపాటు రూ.2లక్షలు బైండోవర్ విధించినట్లు ఎక్సైజ్ సీఐ కోటకృష్ణారావు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారవకోట మండలంలోని తొమ్మిదిమద్యం దుకాణాల కౌంటర్ల ఎదుట మద్యాన్ని పరీక్షించుకొనేందుకు సురక్షయాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొనేందుకు క్యూఆర్‌కోడ్ ఉన్న కన్జ్యూమర్ పోస్టర్లను అతికించినట్లు తెలిపారు.

మద్యం షాపులపై నిఘా పెట్టండి

నరసన్నపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యంషాపుల్లో అమ్మకాలపై నిఘా పెంచాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు కోరారు. శుక్రవారం మడపాంలోని మద్యం దుకాణంలో మద్యం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం నాణ్యత తెలుసుకునేందుకు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చిన సురక్ష యాప్‌పై అవగాహనపెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ పి.లీలారాణి, ఎస్‌ఐ గురుమూర్తి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి అభివృద్ధికి సహకరించాలి: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ అవరణలో గ్రామపెద్దలు, అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా డిసెంబరు31 నాటికి పూర్తిస్థాయిలో ఇంటిపన్ను వసూళ్లు చేయాలని ఈవో చింతాడ సన్యాసిరావుకు ఆదేశించారు.గత ప్రభుత్వ పాలకులకు అవగాహన లేక పంచాయతీ భవనానికి ఎదురుగా మరోభవనం నిర్మించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో ఆ భవనాన్ని కూలదోయాలని అధికారులను ఆదేశించారు. కొతమ్మతల్లి ఆలయ అభివృద్ధికిమరో ఐదుకోట్లు మంజూరుకోసం ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. కొత్తగా వాంఛ్రాడ పంచాయతీ నర్సింగపల్లి వద్ద రూ.3.5 కోట్లు సబ్‌స్టేషన్ మంజూరయ్యిందన్నారు. అలాగే పలువురి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పంచాయతీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీపీవో భారతి సౌజన, ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎల్‌పీవో ఐవీ రమణ, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి అంజిత్‌కుమార్, నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరి, బోయిన రమేష్, కల్లి నాగయ్యరెడ్డి, లక్షణరెడ్డి, గోవిందరావు, రాంకుమార్, గోవింద పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం: ఎంజీఆర్



మాట్లాడుతున్న ఎంజీఆర్

పాతపట్నం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకోసం యువతకు ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.శుక్రవారం పాతపట్నంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జాబ్‌మేళాను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.జాబ్‌మేళాలో రెడ్డీస్ రాయల్ ఎంఫీల్డ్, హెటిరో డ్రగ్స్‌తోపాటు పేరొందిన వివిధ 11 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ మేరకు 482 మందికి యువత హాజరుకాగా ఎంపికైన 301 మందికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో ప్రసాద్, టీడీపీ నేతలు పైల బాబ్జీ, సతీష్, మధుబాబు, పలు కళాశాలలకు చెందిన తిరుపతిరావు, జగన్ పాల్గొన్నారు.

తాగునీటికోసం నిలదీత

పోలాకి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని అప్పారావుపేట, చిన్నకోడూరుల్లో తాగునీటికి ఇబ్బందిపడుతున్నామని అప్పారావుపేట స్వయంశక్తి సంఘాల మహిళలు ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో బి.పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావును శుక్రవారం నిలదీశారు. బీజేపీ నాయకులు చింతాడభారతి, యువజన నాయకులు ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఫోన్ చేయగా అప్పారావుపేట కాలనీకి చేరుకోగా మహిళలంతా చుట్టుముట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పోలాకి నుంచి నీటిక్యాన్‌రూ.20 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని వాపోయారు. ఈకార్యక్రమంలో అప్పారావుపేట, చిన్నకోడూరు కాలనీ యువజన నాయకులు, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఆవిష్కార్ హ్యాక్‌థాన్-2025



హ్యాక్‌థాన్ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు ప్రదర్శించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక విద్యార్థుల నుంచి ఆవిష్కార్ హాక్‌థాన్ -2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాక్‌థాన్‌లో ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ ట్రాక్ రెండురకాలు ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్ ట్రాక్ నవంబరు 25న ప్రారంభమవుతుందని, 24 గంటలపాటు కొనసాగే ఈకార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు నవంబరు 20లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని కోరారు. డిసెంబరు 27 నుంచి 29 వరకు ఆఫ్‌లైన్ ఆదిత్య క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి నవంబరు 25లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.కార్యక్రమానికి గిరీష్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్‌సీఈవో మనోజ్‌కుమార్, డాక్టర్ సతీష్‌కుమార్, సంతోష్‌కుమార్, శ్రీరాములు, కన్వీనర్లు క్రాంతికుమార్, హర్షితలు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● అరిణాం అక్కివలస జంక్షన్‌లో ప్రమాదం.. బయటకు తీసి ఆస్పత్రికి తరలింపు



డ్రైవర్ భవేష్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస జంక్షన్ వద్ద జాతీయరహదారిపై శుక్రవారం లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. ఆయన్ను యంత్రంసాయంతో బయటకు తీసి ఆస్పత్రికితరలించారు. పోలీసుల కథనం మేరకు.. ఇసుకను తీసుకువెళ్లేందుకు విజయనగరం నుంచి రెండు లారీలు శ్రీకాకుళం వస్తుండగా అరిణాం అక్కివలస జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా నిలపడంతో వెనుక వస్తున్న మరో లారీ బలంగా ఢీకొంది. దీంతో వెనుక లారీలో ఉన్న అనకాపల్లి జిల్లా సబ్బవరం సమీపంలోని మల్లునాయుడు పాలేనికి చెందిన డ్రైవర్ గంధి భవేష్ గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఆయన్ను క్రేన్ సాయంతో బయటకు తీసి 108లో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన రెండు లారీలు ఒకే వ్యక్తికి చెందినవి. ఈమేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

పలాసరూరల్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్ కోరారు.శుక్రవారం చినంచ లలో మండలస్థాయి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి సంతోష్, నాయకులు తమ్మినాన గంగారామ్, పైల చక్రధర్ పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

టెక్కలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్కలిఎన్టీఆర్ కాలనీలో డివిజన్ మాజీ సైనికుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. విధిగా మాజీ సైనికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతో పనుల గుర్తింపు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ఉపాధిహామీ పనులు గుర్తించనున్నట్లు ఏపీవో శ్రీదేవి తెలిపారు. చొర్లంగి పంచాయతీపరిధిలోగల కారిగూడలో శుక్రవారం గ్రామచిత్రపటాలను వేయించి గ్రామస్థులకు అవగాహన కలిగించారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాతపట్నం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలోని బలదకు చెం దిన సీజీఎస్టీ, కస్టమ్స్ విశ్రాంత సహాయకమిషనర్ కూనరామారావు కాంగ్రెస్‌లో చేరారు.విజయవాడలోని ఆంధ్రారత్న భవన్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి కండువావేసి ఆహ్వానించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా హరికృష్ణ

నందిగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నందిగాం డిప్యూటీ ఎంపీడీవోగా టి.హరికృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకోటబొమ్మాళి ఈవోగా పనిచేస్తూ పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ మేరకు హరికష్ణను ఎంపీడీవో కుమార్ పట్నాయక్, కార్యదర్శుల సంఘ ప్రతినిధులు రమణబాబు, సంతోష్‌కుమార్, గోపీనాథ్, ఢిల్లేశ్వరరావు అభినందించారు.

నౌగాంలో రీసర్వే గ్రామసభ

నందిగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నౌగాంలో శుక్రవారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా పలాస ఆర్డీవో జి.వెంకటేష్ గ్రామస్థులకు రీసర్వేపై సందేహాలను నివృత్తిచేశారు. సభలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, పలువురు సిబ్బంది ఉన్నారు.

సీఆర్ హక్కులపై అవగాహన

నందిగాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనర్ లఖినాన వెంకటాచలం కోరారు. శుక్రవారం నందిగాం ఉన్నత పాఠశాలలోఇన్‌చార్జి హెచ్‌ఎం బి.కస్తూరి అధ్యక్షతన విద్యార్థులకు వినియోగదారులచట్టం, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఉపాధ్యాయులు కె.కుమారస్వామి, వరప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం

జలుమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులు, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనపరిస్తే శాసనసభలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుందని ఎంఈవో బి.మాధవరావు తెలిపారు. శుక్రవారం కరవంజ ఆదర్శపాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పోటీలు నిర్వహించి మండలస్థాయిలో విజేతగా నిలిచిన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, సీఆర్‌ఎంటీలు పట్ట వైకుంఠరావు, రవికుమార్ పాల్గొన్నారు.

● జలుమూరు (సారవకోట) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి పోటీ పరీక్షలు దోహదపడతాయని ఎంఈవో ఎంవీ రమణ తెలిపారు. సారవకోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజతలకు అభినందించారు.

● మందస,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎంఈవోలు ఎం.లక్ష్మణరావు,భాస్కరరావు తెలిపారు. మందసలో మండల విద్యాశాఖ కార్యాలయంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని వక్తృత్వ, క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించగా బి.సాలిని, ఎం.అమృత, బి.లాస్యలు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

పోక్సో కేసులో నిందితునికి రిమాండ్

హిరమండలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలడైరెక్టర్ అదేపాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో కుటుంబసభ్యుల 100కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోక్సో కేసు నమోదయ్యింది. పోలీసులుకేసు దర్యాప్తు నిర్వహించి నిందితున్ని కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. నిందితునికి కోర్టు 14రోజులురిమాండ్ విధించింది.

ఉచిత వైద్యశిబిరాలతో ప్రజల ఆరోగ్యానికి రక్షణ

హరిపురం,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఉచిత వైద్యశిబిరాలు ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శుక్రవారం మందస మండలంలోని హరిపురంలో గాయిత్రీ చారిటబుల్ ట్రస్టు, కోస్టల్ లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఆమెప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యులు భరత్, చిన్మయ, అనుష్కలు 342మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం హరిపురం సీహెచ్‌సీని సందర్శించారు. ఓపీని, రోగుల గదులను పరిశీలించి సూపరింటెండెంట్ స్వరాజ్యలక్ష్మితో మాట్లాడారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లైన్స్ క్లబ్ ప్రతినిధులు కొర్ల కన్నారావు, బావన దుర్యోధన, పీరుకట్ల విఠల్, రట్టి లింగరాజు, తమిరిభాస్కరరావు, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, లక్ష్మణరావు, వైఎస్‌ఎన్ మూర్తి, సురేష్, రంజిత్, నవీన్ పాల్గొన్నారు.

కార్మికుల పీఎఫ్ కట్టేందుకు చర్యలు

పలాస, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):జీడి కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ కట్టేందుకు చర్యలు తీసుకుంటామని, గతంలో పీఎఫ్‌లు కట్టిన వారికి బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యాపార సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు విశాఖలోని ప్రావిడెంట్ కమిషనర్-2 నితీష్‌కుమార్‌సింగ్‌ను పలాస జీడి వ్యాపారసంఘ నాయకులు మల్లా రామేశ్వరరావు, మల్లా శ్రీనివాస్, తూముల శ్రీనివాస్, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా సంతోష్‌కుమార్‌తో కూడిన ప్రతినిధి బృందం కలుసుకొని జీడి కార్మికుల సమస్యలు ఆయనకు వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సంతబొమ్మాళి ఎస్‌ఐ సింహాచలం కోరారు. శుక్రవారం సూరాడవానిపేటలో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా సోషల్ మీడియాలో క్రైమ్‌తో పాటు, మొబైల్ ఓటీపీల ద్వారా జరుగుతున్న సైబర్‌మోసాలు, స్త్రీల ఆభరణాల అపహరణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజు, సంతబొమ్మాళి మండల తెలుగుయువత ఉపాధ్యక్షులు సూరాడ రాముడు, యంపల్ల చెంచయ్య, బైపల్లి లక్ష్మయ్య, చోడిపిళ్లి రాజారావు, సూరాడ చిన్నారావు, అడ్ల యర్రయ్య పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై సూచనలివ్వండి: డీఆర్వో

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదుపై సలహాలు, సూచనలు ఇవ్వాలని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకుడు పీఎంజే బాబు, బీజేపీ నుంచి సురేష్‌బాబు సింగ్, ఎల్.సోమేశ్వరావు(బీఎస్పీ), ఆర్.శంకరరావు(వైసీపీ), ఎం.గోవిందరావు (సీపీఎం), కేవీఎల్ఎస్ ఈశ్వరి(కాంగ్రెస్), సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్పావీధి హరిచండి అమ్మవారి ఆలయంలో వీరాంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి అభిషేకం చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు కొండా కూర్మారావు, జగన్నాయకులు పాల్గొన్నారు.

● కవిటి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎన్నో ఏళ్లుగా వెలసి ఉన్న అమ్మవారికి ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించి విగ్రహాలను నెలకొల్పారు. పురోహితులు కృష్ణపాడి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తోనే మెరుగైన ఫలితాలు

ఎచ్చెర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌తో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సీడాక్ నాలెడ్జ్ అసోసియేట్ (హైదరాబాద్) అభిజిత్ తేజ్ అన్నారు. ఆర్జీయూకేటీ, శ్రీకాకుళంక్యాంపస్‌లో నేషనల్ క్వాంటమ్‌మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్‌ఫెస్ట్-2025లో నాలుగో రోజు శుక్రవారం ఆయన వివిధ అంశాలపై ప్రసంగించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పురోగతి, ఆవశ్యతకను వివరించారు. ఐబీఎం క్వాంటమ్ పరిశోధక శాస్త్రవేత్త పి.సాయిశంకర్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ భవిష్యత్‌లో క్వాంటమ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐబీఎం క్వాంటమ్ రాయబారి సౌమ్యరంజన్, క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, కన్వీనర్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు పాల్గొన్నారు.

'టెట్' ఆలోచనను విరమించుకోవాలి

గుజరాతీపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ వృత్తిలోకి అన్నిపరీక్షల్లో ఉత్తీర్ణతపొంది, బోధనాఅనుభవం ఉండి, ఇన్‌సర్వీస్ ట్రైనింగ్ ఎప్పటి కప్పుడు తీసుకుంటూ నాణ్యమైన బోధనను అందిస్తున్నారని, వారికి ఇప్పుడు టెట్ తప్పనిసరి చేయడం దారుణమని పేర్కొన్నారు.

పోలియో నిర్మూలన అందరి బాధ్యత

ఇచ్ఛాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలియో నిర్మూలన అందరి బాధ్యత అని, దీనిని తరిమేందుకు అందరూ కృషిచేయాలని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్ వెంక టేష్, రామకోటి అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, రోటరీ సభ్యులు పి.దినేష్, రామారావు, డి.కృష్ణమూర్తి, గోపి చౌదరి, రాజ్‌కుమార్, మధు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

రణస్థలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విధిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరరావు కోరారు. వీరికోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న సూర్యాస్కూల్, లంకపేట, అర్జునవలస హైస్కూల్, ట్వింకిల్ స్కూల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29న రణస్థలం, పైడిభీమవరం, జీరుపాలేం, నారువ హైస్కూల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతికి యూఎన్‌వో కృషి

ఆమదాలవలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని దేశాల మధ్య శాంతి, ఐకమత్యం కోసం ఐక్యరాజ్యసమితి కృషి చేస్తోందని ప్రిన్సిపాల్ ఉషా పద్మిని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూఎన్‌వో దినోత్సవం నిర్వహించారుకార్యక్రమంలో అధ్యాపకులు కె.జగన్నాథరావు, కె.బాలరాజు, పి.అప్పలక్ష్మి, ప్రసాదరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహిస్తే ప్రతిఘటన తప్పదు

● ప్రాజెక్టు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

● థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ యోగి

సరుబుజ్జిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు గాను ఆదివాసీ గ్రామాల్లో రాత్రి సమయాల్లో అక్రమ సర్వేలు నిర్వహిస్తే ప్రతిఘటన తప్పదని రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి హెచ్చరించారు. శుక్రవారం బూర్జ మండలం అద్దూరిపేటలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ఒక చెట్టు భూమి కూడా ఆదివాసీ రైతులు ఇవ్వడం జరిగదని ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలఆమోదంలేకుండా, రైతులు,ఆదివాసీలకు సమాచారం ఇవ్వకుండా రాత్రి సమయాల్లో డ్రోన్లతో సర్వే చేపడుతుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర, కార్యదర్శి సమర సింహాచలం, సవర వెంకటరమణ, జాన్,ఆదెయ్య, మిన్నారావు, ధర్మారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న థర్మల్ వ్యతిరేక ఉద్యమ నాయకులు